క్లుప్తంగా

నియోజకవర్గ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు


తలారి రంగయ్య, మాజీ ఎంపీ

కళ్యాణదుర్గం: చెడుపై మంచి, దుష్ట శక్తుల మీద దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగ జరుపుకుంటారని, నియోజకవర్గ ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త, మాజీ ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం ఆయన నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. దసరా హిందువులకు ముఖ్యమైన పండుగని, జగన్మాత ఆశీస్సులతో సిరి సంపదలతో తులతూగాలని, ప్రతి ఒక్కరి కుటుంబానికి విజయాలు వరించాలని ఆకాంక్షించారు.

ప్రజలందరికీ జగన్మాత ఆశీస్సులుండాలి


మెట్టు గోవిందరెడ్డి, సమన్వయకర్త

రాయదుర్గం: రాయదుర్గం నియోజకవర్గం ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. జగన్మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి, దుష్ట శక్తులపై .. దైవ శక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకునే పండగే విజయదశమి అన్నారు.

15న 'పల్లె పండుగ'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో ఈనెల 15న పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. స్థానిక ప్రజా వేదికలో పార్టీ శ్రేణులు, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రజలు సమస్యలపై వినతులు ఇచ్చుకోవాలన్నారు.


చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

శెట్టూరు: విద్యార్థులుక్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అన్నారు. శుక్రవారం కనుకూరు లోని శరన్నవరాత్రుల ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం జాతీయ టెన్నికాయిట్ క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. హెచ్ఎం సుధ, పాఠశాల పీడీ అమరాంజనేయులు, ఏపీ హైకోర్ట్ అడ్వొకేట్ శేషాద్రినాయుడు, మాజీ జెట్పీటీసీ గురుప్రసాద, పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

బొకుగుప్ప: మండలంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం బూదిగుమ్మలో విజయదశమి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా పద్మావతి వెంకటరమణ స్వామి రథోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు. రథోత్సవంలో భాగంగా ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు అభిషేకాలు అనంతరం పల్లకీ సేవ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 4 గంటల నుంచి రథోత్సవం నిర్వహించనున్నారు.

బియ్యం పంపిణీలో గందరగోళం


రేషన్ బియ్యం తక్కువ వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కార్డుదారులు

వజ్రకరూరు: వెంకటాంపల్లిపెద్ద తండా (రూపానాయక్ తండా) గ్రామంలో శుక్రవారం రేషన్‌బియ్యం పంపిణీలో గందరగోళం నెలకొంది. శుక్రవారం మధ్యాహ్నం రేషన్ బియ్యం పంపిణీని ప్రారంభించారు. రేషన్ కోసం కార్డుదారులు బారులు తీరారు. బియ్యం తక్కువ తూకం వేస్తున్నారని కార్డుదారులు ప్రశ్నించారు. దీంతో తీవ్ర గందరగోళం నెలకొంది. రేషన్ పంపిణీలో నెలకొన్న గందరగోళంపై కార్డుదారులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వీఆర్వో ముత్యాలు అక్కడకు చేరుకొని రేషన్ బియ్యం పంపిణీ నిలిపివేశారు.

నవదుర్గ నమోనమః


ఆకట్టుకున్న నవదుర్గల దర్శనం

రాయదుర్గంటౌన్: ప్రజాపిత ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో శుక్రవారం జరిగిన నవదుర్గ దేవీల వేషప్రదర్శన ఆకట్టుకుంది. చిన్నారులతో ప్రదర్శించిన దుర్గాదేవి, లక్ష్మీదేవి, సరస్వతీదేవి, పార్వతిదేవి, అన్నపూర్ణదేవి, కాళీదేవి, గాయత్రిదేవి, పార్వతిదేవి, కన్యకాపరమేశ్వరిదేవి అలంకరణ ఆకట్టుకుంది. విశ్వ విద్యాలయం సంచాలకురాలు బీకే యోగీశ్వరి మాట్లాడారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు

వజ్రకరూరు:మండలంలోని కొనకొండ్ల గ్రామంలో భక్తుల కొంగుబంగారం పెద్దమ్మ తల్లి దేవాలయంలో శరన్నవరాత్రులను పురస్కరించుకుని తొమ్మిదో రోజు శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ప్రతిభకు ప్రోత్సాహం..భవితకు ఉపకారం

- ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు
- ఎన్‌ఎంఎస్ పథకం కింద అందజేస్తున్న కేంద్రం
- ఏడాదికి రూ.12 వేలు చొప్పున నాలుగేళ్ల పాటు లబ్ధి
- 8 తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం


ఉరవకొండలో నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ కు ఉచిత శిక్షణ ఇస్తున్న దృశ్యం


ఉరవకొండలోని ఎస్కే ప్రభుత్వ పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ మాదిరి పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: చదువుకోవాలనే తపన, ఏదైనా సాధించాలనే పట్టుదల, ఉన్నత శిఖరాలకు చేరాలనే ఆకాంక్ష ఉన్నా అనేక మంది విద్యార్థులకు ఆర్థిక పరిస్థితులు అనుకూలించడం లేదు. దీంతో ప్రతిభ ఉన్నా చదువు మానేసి కూలీ పనులు చేసుకోవాల్సిన పరిస్థితి. దీన్ని గమనించిన కేంద్రప్రభుత్వం ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఆర్థిక చేయూతతో విద్యా ప్రగతికి బాటలు వేస్తోంది. విజ్ఞానమే కొలమానంగా ఉపకారవేతనాలు మంజూరు చేస్తోంది. జాతీయ ఉపకార వేతనం ద్వారా ఏడాదికి రూ.12 వేలు చొప్పున నాలుగేళ్ల పాటు అందచేస్తుంది.

చదువు అర్ధంతరంగా ఆగిపోకూడదని..

తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో మంచి స్థాయిలో స్థిరపడాలని కలలు కంటారు. పేదరికంతో వారి ఆశలు అడియాశలు అవుతున్నాయి. రూ.లక్షలు ఖర్చు చేసి చదవించే స్తోమత లేక చదువులు అర్ధంతరంగా ఆగిపోతున్నాయి. దీన్ని గమనించిన కేంద్ర ప్రభుత్వం 2008లో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పథకాన్ని ప్రవేశపెట్టింది.

ఉరవకొండ 'నిస్వార్థ' ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ..

గత పదేళ్లగా నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఉచిత శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. నిస్వార్థ సంస్థ వ్యవస్థాపకుడు, సీనియర్ గణిత ఉపాధ్యాయులు వెంకట్ తాడికొండ ఆధ్వర్యంలో నిపుణులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. గత 10 ఏళ్ల నుంచి దాదాపు 30 మంది ప్రభుత్వ జెడ్పీ ఉన్నత, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు అర్హత సాధించడం విశేషంగా చెప్పుకోవచ్చు.

అర్హతలు:

ప్రభుత్వ జిల్లా పరిషత్, ఎయిడెడ్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదివే విద్యార్థులు ఎన్ఎంఎస్ పరీక్ష రాసేందుకు అర్హత ఉంటుంది. వీరు ఆరు, ఏడో తరగతుల్లో 50శాతం మార్కులతో పాసై ఉండాది. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలకు మించకూడదు.

పరీక్ష విధానం:

ఎన్ఎంఎస్‌పరీక్ష విధానం మొత్తం అబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. మూడు గంటల వ్యవధిలో 180 ప్రశ్నలకు సమాధానం రాయాలి. పరీక్షలో ప్రతిభ చూపిన వారికి ఉపకార వేతనానికి ఎంపిక చేస్తారు.

దరఖాస్తుల ఆహ్వానం..

2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఎన్ఎంఎస్ పరీక్షకు ఆగస్టు 5వతేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అక్టోబర్ నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఓసీ, బీసీలు రూ.100 ఎస్టీ, ఎస్సీలు రూ.50 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థులు ఆధార్ కార్డులో ఉన్న వివరాల మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతు ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు గత 10 ఏళ్లగా ఉచితంగా ఎన్ఎంఎస్ శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాలకు 30 మంది ఎంపిక కావడం ఎంతో గర్వంగా ఉంది.
– వెంకట్ తాడికొండ, గణిత ఉపాధ్యాయులు, నిస్వార్థ ఫౌండేషన్ ప్రతినిధి, ఉరవకొండ

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ఎన్ఎంఎస్ పథకం ఎంతో ఉపయోగకరం. 8వ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థీ దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్షల్లో ప్రతిభ కనబరిస్తే నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేలు చొప్పున కేంద్రం ఉపకార వేతనాలు అందచేస్తారు.
– ఈశ్వరప్ప, ఎంఈఓ, ఉరవకొండ

ఉచిత కోచింగ్ వల్ల అర్హత సాధించా



2022లో నిస్వార్థ ఫౌండేషన్ వారి ఉచిత శిక్షణ ఫలితంగా ఎన్ఎంఎస్‌కు అర్హత సాధించాను. ప్రతిభ కలిగిన నాలాంటి పేద విద్యార్థులకు కేంద్రం అందిస్తున్న స్కాలర్ షిప్ ఎంతో ఉపయోగపడుతుంది. భవిష్యత్తులో చదువుల్లో మరింత మెరుగ్గా రాణిస్తాను.
– సాయిచైత్ర, ప్రభుత్వ జడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాల, ఉరవకొండ

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి


బాధిత కుటుంబాలకు చెక్కులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: నియోజకవర్గంలోని కార్యకర్త, నాయకులకు అండగా నిలుస్తామని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో ఇటీవల టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన గంధోడి మారేష్‌తో పాటు షేక్షానుపల్లికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు గుర్రం శ్రీనివాసులు భార్య అయ్యమ్మకు చెరో రూ.50 వేల చెక్కును విశ్వేశ్వరరెడ్డి చేతులమీదుగా అందించారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ టీడీపీ గుండాల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కోసం పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పంపిన చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను టార్గెట్ చేస్తూ, వీధి రౌడీల్లా వ్యవహరిస్తున్నారన్నారు. మంత్రి కేశవ్ కనుసన్నల్లో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో దాడులకు పాల్పడుతూ కలాలు, మతాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఉరవకొండలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటూ టీడీపీ దౌర్జన్యాలను ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలిగొండ నరసింహులు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు సీపీ వీరన్న, పెన్నహోబిళం ఆలయ మాజీ చైర్మెన్ అశోక్, పార్టీ మండల సమన్వయకర్త ఓబన్న, ఎంపీటీసీ ఈడిగ ప్రసాద్, షేక్షానుపల్లి గ్రామ నాయకులు రంజాన్‌సాహెబ్, ప్రభాకర్, ఎల్లప్ప, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి నిధుల పంపిణీకి సర్వేలు

కుందుర్పి: మండల వ్యాప్తంగా పండ్లతోటలు సాగు చేసిన రైతులకు అభివృద్ధి నిధులు అందజేస్తున్నట్లు కుసుమగిరి రైతు ఉత్పత్తి దారుల కంపెనీ లిమిటెడ్ మండల అధ్యక్షుడు లక్ష్మీపతి, కోఆర్డినేటర్ నరశింహమూర్తి తదితరులు తెలిపారు. శుక్రవారం బెస్తరపల్లి,కెంచంపల్లి,కుందుర్పి,నిజవల్లి తదితర గ్రామాల్లో పండ్లతోటలు సాగుచేసిన రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు నమోదు పత్రాలను అందజేశారు.

చాబాలలో తాగునీరు సరఫరా

వజ్రకరూరు: మండలంలోని చాబాల గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త టైలర్ లాలు దాతృత్వాన్ని చాటుకున్నారు. తాగునీటి సరఫరా కార్మికుల సమ్మెతోపాటు పీఏబీఆర్‌లో మోటార్లు పనిచేయకపోవడంతో చాబాల గ్రామానికి 15 రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామంలో నీటి ఎద్దడి నెలకొనడంతో టైలర్ లాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో శుక్రవారం సొంత డబ్బులతో వాటర్‌ట్యాంకు ఏర్పాటు చేయించి, ప్రజలకు తాగునీరు సరఫరా చేశారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ


రాయదుర్గంలో పండుగ సామగ్రి కొనుగోలు దారులతో నెలకొన్న సందడి


పండుగ సామగ్రి కోనుగోలుదారులతో కిటకిటలాడుతున్న ఉరవకొండ క్లాక్‌టవర్ ప్రాంతం

- నేటితో ముగిసిన దేవీ శరన్నవరాత్రులు
- తొమ్మిది రోజుల పాటు విశిష్ట అలంకరణలో అమ్మవారి దర్శనం
- సందడిగా ముగిసిన ఆయుధపూజ
- నేడు బన్నిమాను దర్శనానికి ఏర్పాట్లు

రాయదుర్గం: దసరా పండుగ పర్వదినం సందర్భంగా ఆలయాలకు ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. తొమ్మిది రోజుల పాటు వివిధ అలంకరణలో కొలువుదీరిన అమ్మవారు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. నవరాత్రి ఉత్సవాలు నేటితో వైభవంగా ముగిశాయి. ఇళ్లు, వ్యాపార సముదాయాలు, కర్మాగారాలు, వాహనాలు, కత్తి, సుత్తి, వ్యవసాయ పనిముట్లకు ప్రజలు పూజ చేశారు. ఎద్దులు, ట్రాక్టర్లు, ఆటోలు, బస్సులు, లారీలు పూలతో అలంకరించారు. శనివారం వేకువజాము నుంచే వేడుకలు ప్రారంభం కానున్నట్టు అర్చకులు తెలిపారు.

కిటకిటలాడిన దారులు.. : ప్రతి ఇంటా దసరా పండుగ వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. కొత్తదుస్తులు ధరించి, వివిధ పిండి వంటకాలు ఆరగిస్తారు. ఈ నేపథ్యంలో వాటిని కొనుగోలు చేసేందుకు పట్నం వైపు పల్లె ప్రజలు క్యూకట్టారు. దీంతో రాయదుర్గం చేరే దారులన్నీ జనజాతరను తలపించాయి. బళ్లారి రోడ్డు, కణేకల్లు రోడ్డు, వినాయసర్కిల్ ప్రాంతాలన్ని జనంతో నిండుకుపోయాయి. ప్రజలంతా సుఖసంతోషాలతో పండుగ జరుపుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు.

దుర్గంలో దసరా సందడి

రాయదురంటౌన్: రాయదుర్గంలో శుక్రవారం దసరా పండుగ సామగ్రి కొనుగోలుదారులతో ప్రధాన వీధుల్లో సందడి నెలకొంది. దుస్తులు, పూజా, కిరాణ సామగ్రి కొనుగోలుకు గ్రామీణులు తరలిరావడంతో వ్యాపార సముదాయమైన పాత బస్టాండ్, వినాయక సర్కిల్, కూరగాయల మార్కెట్ ఏరియా, బళ్లారి రోడ్డు జనంతో కిటకిటలాడాయి. పాతబస్టాండ్ నుంచి వినాయక సర్కిల్ వరకు రోడ్డు డివైడర్‌పై భారీ ఎత్తున పూల విక్రయాలు జరిగాయి.

కొనుగోలుదారులతో కిటకిటలాడిన క్లాక్‌టవర్

ఉరవకొండ: దసరా పండుగ నేపథ్యంలో పండుగ సామగ్రి కోనుగోలుదారులతో క్లాక్‌టవర్ ప్రాంతం కిటకిటలాడింది. పండుగకు సంబంధించి పూలు, అరటి ఆకులు, టెంకాయలు, పండ్లు తదితర వాటిని పెద్ద ఎత్తున కోనుగోలు చేయడానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు. దీంతో పాటు క్లాక్‌టవర్ వద్ద ఉన్న పలు గార్మెంట్స్ షాపులు కోనుగోలుదారులతో కిటకిటలాడాయి.

కూడేరు: మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు పూజా సామగ్రి, వంట సరుకులు, బట్టలు కొనుగోలు చేసేందుకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

జయ జయ హే మహిషాసురమర్దిని


రాయదుర్గంలో అలంకరణలో మహాలక్ష్మి


అలంకరణలో డీహీరేహాల్ నీలకంఠేశ్వరుడు


బూదిగుమ్మలో మహిసాసురమర్దిని


ఉరవకొండలో మహిషాసురమర్దిని


మహిసాసురమర్దిని అవతారంలో భద్రకాళి


విశేష పూజలందుకున్న బన్నీ మహంకాళమ్మ

ఉరవకొండ: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గుంతకల్లు రోడ్డు వద్ద వెలసిన జగదీశ్వరి ఆలయంలో అమ్మవారి మహిషాసుర మర్దినిగా శుక్రవారం దర్శనిమిచ్చారు. ఆలయ ధర్మకర్త గాజుల శ్యామలమ్మ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. స్థానిక ఉరగాద్రి చౌడేశ్వరీ ఆలయంలో మహిషాసురమర్దినిగా అలంకరణ చేశారు.

దుర్గాదేవి నమోనమః

రాయదుర్గంటౌన్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వెలసిన అమ్మవారి ఆలయాల్లో తొమ్మిదో రోజు శుక్రవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కోటలో వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఓబుళాచారి రోడ్డు బన్నీ మహంకాళమ్మ, శాంతినగర్‌లోని పెద్ద బన్నీ మహంకాళిదేవి ఆలయాల్లోనూ, నేసేపేటలోని చౌడేశ్వరిదేవి, కంసలవీధిలో వెలసిన కాళికాంబ దేవి ఆలయాల్లో అమ్మవారికి విశేష పూజలు చేశారు. హటకేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి విశేష పూజలందుకున్నారు. కోటలో వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో దుర్గాష్టమిని పురస్కరించుకుని వాసవీమాత చండీ హోమాన్ని శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శాంతినగర్‌లో నిపెద్ద బన్నీ మహంకాళి గంగపూజ నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ఆయుధ పూజ

రాయదుర్గంటౌన్: దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దుర్గాష్టమి, ఆయుధ పూజ ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ మాధవి ఆధ్వర్యంలో వైద్యులు, నర్సులు, సిబ్బంది దుర్గాష్టమి, ఆయుధ పూజ చేశారు. పాత మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్ ఆధ్వర్యంలో వాహనాలకు పూజ జరిపారు.


రాయదుర్గంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఆలయాల్లో నవమి ఉత్సవాలు

కుందుర్పి: మండలంలోని తూముకుంట హరిహరేశ్వరస్వామి ఆలయం, బెస్తరపల్లి సవారమ్మ ఆలయం, నాగేపల్లి యల్లమ్మ ఆలయం, వడ్డేపాళ్యం గుడిబండ ఆంజనేయస్వామి ఆలయం, కదరంపల్లి దుర్గాదేవి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు.

కూడేరు: మండలంలోని కమ్మూరులో గ్రామదేవత పెద్దమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారి నామస్మరణ మార్మోగింది. ఆలయ అర్చకులు పెద్దమ్మ అమ్మవారికి తొలుత పాలాభిషేకం చేసి, తర్వాత పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. సర్పంచ్ రంగారెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో ఆయుధాల పూజను శుక్రవారం జరుపుకున్నారు. రైతులు, వ్యాపారులు, కూలీలు,శ్రామికులు తమ వాహనాలకు పూజలు చేశారు. రైతులు వృషభాలు, ట్రాక్టర్లను పూలతో అందంగా అలంకరించారు.

ఘనంగా ఆయుధ పూజ

బొమ్మనహాళ్: స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఘనంగా ఆయుధ పూజ నిర్వహించారు. ఎస్ఐ నబీ రసూల్ ఆధ్వర్యంలో దుర్గమ్మ అమ్మవారి చిత్రపటానికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

గుమ్మఘట్ట: తాళ్లకెర గ్రామంలో ఉన్న వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళి అమ్మవారు శుక్రవారం మహిసాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆలయాల్లో నవమి పూజలు

బొకుగుప్ప: మండలంలోని బూదిగుమ్మ పద్మావతి వెంకటరమణస్వామి ఆలయాల్లో అమ్మవారు మహిసాసురమర్దినిగా దర్శనమిచ్చారు. బొకుగుప్పలో మారెమ్మ దేవమ్మ అమ్మవారు దుర్గాదేవిగా, తగ్గుపర్తిలోని తగ్గుపర్తమ్మ దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.

వైభవంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట :

బొకుగుప్ప తండా గ్రామంలో దాతల దాతృత్వంతో నిర్మించిన నూతన ఆలయంలో గత రెండు రోజులుగా వైభవంగా శ్రీదుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. శుక్రవారం దుర్గామాత అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, గోపుర కలశ స్థాపన పూజలు నిర్వహించారు.

జగజ్జనని చల్లని దీవెనలు అందరిపై ఉండాలి


వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే


వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ

ఉరవకొండ: విజయదశమి సందర్భంగా జగజ్జనని చల్లని దీవెనలు అందరిపై ఉండాలని, ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ, ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి ఉరవకొండ నియోజకవర్గ ప్రజలకు శుక్రవారం ఓ ప్రకటనలో విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా గొల్లపల్లి సుంకలమ్మ గ్రామోత్సవం


అలంకరణలో గొల్లపల్లి సుంకలమ్మ అమ్మవారు

కూడేరు: కూడేరుకు సమీపంలో ప్రసిద్ధి గాంచిన గొల్లపల్లి సుంకలమ్మ అమ్మవారి గ్రామోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరణ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం కూడేరు గ్రామ పురవీధుల్లో సుంకులమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

మద్యం షాపులకు 50 దరఖాస్తులు

కంబదూరు: కంబదూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్యం షాపు టెండర్లకు దరఖాస్తు స్వీకరణ గడువు శుక్రవారంతో ముగిసింది. నాలుగు మద్యం షాపులకుగాను 50 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. కంబదూరుకు 17, శెట్టూరు 11, కుందుర్పి 14, ఎనుములదొడ్డికి 8 చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు సీఐ తెలిపారు.

వాటర్‌షెడ్డు కార్యాలయం ప్రారంభం

కుందుర్పి: అప్పిలేపల్లి పరిసర ప్రాంతాల్లో నాబార్డు నిధులతో ఏర్పాటు చేసిన వాటర్‌షెడ్డు కార్యాలయాన్ని ప్రారంభించినట్లు వాటర్‌షెడ్డు కమిటీ అధ్యక్షుడు తిప్పేస్వామి, కోకన్వీనర్ అతావుల్లా తదితరులు శుక్రవారం తెలిపారు. నాబార్డ్ నిధులు రూ.కోటితో సుమారు 350 ఎకరాల్లో పండ్లతోటలు సాగు చేస్తున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అంజనమ్మ కమిటీ మెంబర్లు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

బొకుగుప్ప: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ చిన్న గౌస్ పేర్కొన్నారు. ఉరవకొండ రూరల్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన చిన్నగౌస్ బొకుగుప్ప పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. ఎస్ఐ శివతో మాట్లాడారు.

పొంచి ఉన్న ప్రమాదం


ప్రమాదంగా ఉన్న మలుపులో వెళ్తున్న బస్సు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం వైపు నుంచి అనంతపురం ప్రధాన రహదారి పక్కన బోరంపల్లిలోకి వెళ్లే రహదారి మలుపు ప్రమాదకరంగా మారింది. హైవే నుంచి గ్రామంలోకి వెళ్లే దారిలో కంపచెట్లు ఏపుగా పెరిగి, రోడ్డును ఆక్రమించేశాయి. దీంతో అటు వైపుగా వచ్చే వాహనాలేవీ కనిపించలేదని వాహనదారులు, స్థానికులు అంటున్నారు. ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులు చొరవ చూపి రోడ్డును ఆక్రమించిన కంపచెట్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

రేపు పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో కవి సమ్మేళనం సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు పుస్తకాల ఆవిష్కరణ సభ జరుగుతుందని నిర్వాహకుడు కొత్తపల్లి సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కవి వెంకటకృష్ణ రచించిన ×రవ్వలసడి¤ శ్రీనివాస గౌడ్ రచించిన 'శ్రీనివాసం' పుస్తకాలను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణ స్వామి, వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతి నారాయణ ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. సాహితీ అభిమానులందరూ విచ్చేయాలని కోరారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మీ, మల్లీశ్వరి సూచించారు. శుక్రవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో డెంగీ, మలేరియా, సీజనల్ వాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, రమాదేవి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

కూడేరు: మండల కేంద్రం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురానికి చెందిన గౌస్ పీరా, రాఘవ గాయపడ్డారు. ఈ ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై పీఏబీఆర్ డ్యాంకు వెళ్లి తిరిగి వస్తుండగా కూడేరుకు సమీపాన అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై ఉన్నట్టుండి గేదె అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడ్డారు. గాయపడిన వారు స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు.

భక్తులకు అన్నదానం

బొమ్మనహాళ్: ఉద్దేహాళ్ గ్రామంలోని జమ్మిచెట్టు వద్ద దుర్గమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున ప్రత్యేక పూల మాలలతో అమ్మవారికి, జమ్మిచెట్టుకు అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. యూత్ సభ్యులు విశ్వనాథ్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, వన్నూరుస్వామి, రాజు, రంగారెడ్డి, మోహన్‌రెడ్డి, కావలి శీన, జగదీష్, రామకృష్ణ, శివ అన్నదానం చేశారు.